రోమాలో నున్న ప్రభువు సంఘానికి పౌలు వ్రాసిన పత్రిక యొక్క రెండవ భాగమునకు ఈ క్రింది సంక్షిప్త వర్ణన (outline) ఉపోద్ఘాతంగా ఉపయోగపడుతుంది.

## తొమ్మిదవ అధ్యాయము

9:1-5. **ఇశ్రాయేలు ప్రజల కోసం పౌలు దుఃఖించుట.**

దత్త పుత్రత్వమును దైవ మహిమయు నిబంధనలును ధర్మశాస్త్రమును అర్చనాచారాదులును వాగ్దానములును వీరివి. మొదటి శతాబ్దపు యూదుల శరీరము ద్వారా క్రీస్తు వీరిలో పుట్టెను.

9:6-13. **దేవుని మాట తప్పిపోలేదు (విఫలమవ్వలేదు).**

పౌలు చూపించే రుజువులు ఏమిటి?

**మొదటి సంగతి.** అబ్రాహాము, ఇస్సాకు మరియు యాకోబు యొక్క భౌతిక సంతతి అంతయు ఇశ్రాయేలీయులు కారు. "ఇశ్రాయేలీయులు ఎవరు?" అని గుర్తించే క్రమంలో సాధారణమైన పుట్టుక లెక్కలోనికి రాదు.

**రెండవ సంగతి.** ఇశ్రాయేలీయులు ఒక జాతిగా విఫలమయ్యారు; అయిననూ, దేవుని పిల్లలు **వాగ్దాన సంబంధమైన పిల్లలైయున్నారు** గనుక అబ్రాహాముకు దేవుడిచ్చిన వాగ్దానములు ఇప్పటికీ అమలులో ఉన్నాయి.

**మూడవ సంగతి.** వాగ్దాన సంబంధమైన పిల్లలు దేవుని యొక్క నిజమైన ఇశ్రాయేలీయులైయున్నారు. వారే క్రీస్తు సంఘము. (రోమా 16: 16; గలతీ. 6:16).

9:12-21. **ఏర్పాటులో దేవుని ఉద్దేశము.**

అది ఎలా పనిచేస్తుంది:

1. దేవుని రాజ్యంలో పిల్లలను కలిగియుండుటయే ఆయన అనాది సంకల్పము.
2. ఈ పిల్లలు దేవుని ఎన్నికను బట్టి నిశ్చయింపబడ్డారు.
3. ఆదాము చేసిన పాపమును బట్టి దేవుని ఏర్పాటు (వాగ్దాన సంబంధులైన పిల్లలు) తప్పకుండా దేవుని కరుణాస్పదమై యుండాలి (రోమా 11:32).
4. దేవుని ప్రణాళిక సంకల్పముపై మానవుని కోరిక మరియు ప్రయాస ఏ మాత్రము ప్రభావమును చూపదు.
5. దేవుడు కుమ్మరి, మానవాళి కుండ. మానవుని రూపకల్పన సృష్టిలో దేవుని ఉద్దేశమును కొనియాడును.

9:22-24. **ప్రజలంతా నివసించు రెండు ప్రదేశాలు:**

1. మహిమ కొరకు దేవుని **కరుణా** పాత్రఘటములుగా ముందుగానే నిర్ణయింప బడినవారు.
2. నాశనము కొరకు దేవుని **ఉగ్రతా** పాత్ర ఘటములుగా ముందుగానే నిర్ణయింప బడినవారు.

ప్రతి వ్యక్తికి ఎంచుకొను ఆధికృత ఉంది, కాని నివాసము (ఘటములు) ముందుగా నిర్ణయింపబడింది.

9:25-33. **దేవుని వాగ్దానములు విశ్వాస మూలమైన ప్రత్యుత్తరమును ఖచ్చితంగా కోరును; కాబట్టి యూదులు మరియు అన్యులు ఇరువురికి విశ్వాస ద్వారము తెరవబడియున్నది.** రోమా 4:16

ఈ **అంత్యదినాలలో** దేవుని వాగ్దానములు మానవాళి యొద్దకు రావడానికి కారకుడైన యేసుక్రీస్తు అబ్రాహామునకు ఒకే ఒక్క సంతానమైయున్నాడు (గలతీ. 3:16-18).

యేసునందలి విశ్వాసమూలమున దేవుని నీతిదానము ప్రాయశ్చిత్తార్థబలిగా వచ్చును.

అనేకమంది అన్యులు విశ్వాసము ద్వారా యేసును అంగీకరించారు.

తమ క్రియల మూలముగా దేవుని నీతిని వెదుకుతూ అనేకమంది యూదులు యేసు అను సీయోను రాతిపై తొట్రిల్లిరి.

## పదవ అధ్యాయం

10:1-4. **ఇశ్రాయేలీయుల కొరకు పౌలు ప్రార్థన.**

వారు ఆసక్తిగలవారే, కాని వారికి జ్ఞానం కొదువైనది. వారు కలిగియుండని జ్ఞానం ఏదనగా: “విశ్వసించు ప్రతివానికి నీతి కలుగుటకై క్రీస్తు ధర్మశాస్త్రమునకు సమాప్తియై యున్నాడు”.

10:5-7. **దేవుని నీతిని గూర్చిన జ్ఞానం.**

- మోషే వివరణ-ఆలాగున చేయుము.
- విశ్వాసమూలమైన నీతి మాట్లాడును; కాని అది ఎక్కడ నుండి మరియు అది ఎలా వచ్చింది?
- మొదటిగా అర్థం చేసుకోవలసింది ఏమిటంటే విశ్వాసానికి కేంద్ర బిందువు ఉంది. అంటే ఒక దానియందు విశ్వాసము. అయితే ఇక్కడ కేంద్ర బిందువు సీయోను రాయియైన యేసుక్రీస్తు. ప్రకటించబడినది విశ్వాసవాక్యమే. క్రీస్తు ప్రకటించబడ్డాడు. రోమా 1:1-6, 16,17; 3:21-26; 9:33; 10:4. చూడుము.

10:8-13. **విశ్వాసము హృదయము నుండి మాట్లాడును.** అది అక్కడికి ఎలా వచ్చింది?

*నేర్చుకొను ప్రక్రియ మొదటిది:* ఒక వ్యక్తి యేసు సువార్తను వినినప్పుడు, ఆ సువార్త అతని లేదా ఆమె మనస్సులోకి తీసుకొనిపోబడును

*నేర్చుకొను ప్రక్రియ రెండవది:* అతడు లేదా ఆమె నమ్మి విధేయత చూపును. (నమ్మకము మరియు విశ్వాసము మధ్య వ్యత్యాసమును తెలియజేసే పదము “విధేయత”.)

ప్రకటించబడిన ఆశీర్వాదము ఇప్పుడు హృదయమందున్నది. హృదయంలో ఏముంది? యేసును గూర్చి ప్రకటించబడిన వర్తమానము. ఇదే హృదయములో ఉన్న విశ్వాసము. విశ్వాసమూలమైన నీతి శక్తివంతమైనది. అది మార్పు కోసం నడిపించు శక్తియైయున్నది.

*నేర్చుకొను ప్రక్రియ మూడవది:* యేసుక్రీస్తునందలి విశ్వాసము ఇప్పుడు అంతర్గతం చేయబడింది; కాబట్టి, **అది మాట్లాడును.** యేసు ప్రభువని అది ఒప్పుకొనును. నీతిమంతునిగా తీర్చబడిన దేవుని కుమారుడు (అతడు లేదా ఆమె) తన విశ్వాసమును లోకం యెదుట ఒప్పుకొనును (రోమా 12:1,2).

10:13-15. **“ప్రభువు నామమును బట్టి ప్రార్థన చేయువాడెవడో వాడు రక్షింపబడును.”**

ఈ వాక్యభాగంలో పౌలు వాడిన అలంకారిక ప్రశ్నలను గమనించుము. “అయితే దేవునిమాట తప్పిపోయినట్టు కాదు” రోమా 9:6 లో వాక్యాన్ని గ్రహించడానికి పాఠకుని మనస్సును సిద్ధపరచుటకై అతడు ఆ ప్రశ్నలు వాడెను.

క్రీస్తు సువార్త ద్వారా రక్షించబడుటకై విఫలమైన భౌతిక ఇశ్రాయేలీయులకు సంబంధించి దేవుని మాట ఎందుకు తప్పపోయినట్టు కాదో ఈ క్రింది భాగము నందు అతడు చూపిస్తాడు.

10:16-21. **రక్షణ పొందుటకు విఫలమైన ఇశ్రాయేలీయుల మూలమును గూర్చిన పౌలు స్వంత ప్రశ్నలకు సంబంధించి పాత నిబంధన ప్రవక్తలు జవాబిచ్చునట్లు అతడు చేసున్నాడు.** (రోమా 10:1 గమనించుము).

**దేవుని వాక్యం వినుట వలన విశ్వాసము కలుగును** అనే ప్రాథమిక సూత్రంతో పౌలు ప్రారంభిస్తున్నాడు. వాదన ఇలా ప్రారంభమవుతుంది:

- ఇశ్రాయేలీయులు వినలేదా? 18 వచనం.

  వర్తమానము భూదిగంతముల వరకు బయలు వెళ్లెనని 19వ దావీదు కీర్తన ప్రకటించింది.

- ఇశ్రాయేలునకు తెలియకుండెనా? 19వ వచనం.

  దేవుని నీతిని కొంతమంది అన్యజనులు సహితం గ్రహించి నెరవేర్చెనని చూపించుటకు మోషే మరియు యెషయా ఇరువురు పలికిన మాటలను పౌలు ఎత్తి చూపిస్తున్నాడు (రోమా 2:14).

జ్ఞాన సత్య స్వరూపమైన ధర్మశాస్త్రము ఇశ్రాయేలీయులకు అప్పగించబడినది (రోమా 2:19-21). కాబట్టి వారు ఎలా అర్థం చేసుకోలేక యుండిరి?

- స్తెఫను ప్రతిధ్వనింపచేసిన వాటినే యెషయా చెప్పినట్లు పౌలు చూపాడు; భౌతిక ఇశ్రాయేలీయులు తమ అవిధేయత మరియు మూర్ఖత్వముతో "దేవుడు చాచిన హస్తాన్ని" తృణీకరించిరి. 21 వచనం. అపొ. కార్య. 7:51 చూడుము.
- దేవుని మాట ఎన్నటికీ, ఎప్పటికీ తప్పపోలేదనే సంగతిని రోమాలో ఉన్న సంఘము తేటగా తెలుసుకోవాలని పౌలు కోరాడు. మరొక ప్రక్క-దేవుని ఉద్దేశమునందు విశ్వాసముంచు నిమిత్తమై దేవుని మాట వినని చరిత్ర మానవాళికున్నది. ఇశ్రాయేలీయులు కూడా దీనికి మినహాయింపు కాదు.

## పదకొండవ అధ్యాయము

రోమా 11:1-6. **"ఆలాగుననే అప్పటికాలమందు సయితము కృపయొక్క యేర్పాటుచొప్పున శేషము మిగిలియున్నది."**

గ్రహీతల కోసం రెండు సంగతులు:

1 "దేవుడు తన ప్రజలను విసర్జించెనా?" ఈ సందర్భంలో దేవుని ప్రజలు యూదులు కాదనేది పౌలు జవాబు! పౌలు రక్షించబడ్డాడు మరియు అతడు ఒక యూదుడు.

2. యేసు క్రీస్తు నందలి విశ్వాసము ద్వారా దేవుడు అబ్రాహాముకిచ్చిన వాగ్దానములను అంగీకరించిన ప్రజలే కృప చేత ఏర్పరచబడిన శేషమైయున్నారు.

**రోమా 11:7-10. ఏర్పాటు నొందినవారు.**

రోమాలో ఉన్న క్రీస్తు సంఘానికి పౌలు వ్రాసిన పత్రిక యొక్క రెండవ భాగంలోని ఈ విషయమును గూర్చి రెండు పెద్ద చర్చలు చోటు చేసుకుంటున్నాయి.

**ఒకటి**, దేవుని యొక్క ఆత్మీయ ఇశ్రాయేలు ఎవరు?

**రెండు**, దేవుని మాట తప్పిపోయెనా? ఇది అబ్రాహామునకు దేవుడిచ్చిన వాగ్దానములతో ప్రత్యేకమైన సంబంధము కలిగియున్నది.

మొదటి శతాబ్దపు యూదుల విషయంలో దేవుని మాట తప్పిపోలేదని మనం నేర్చుకొన్నాం. వారు రక్షించబడలేదనునది వాస్తవం; అయిననూ, దేవుని మాటలో లోపమేమియులేదు. తప్పిదము యూదులదే.

"దేవుని ఇశ్రాయేలు" ఎవరు? అను విషయమై నొక్కి చెప్పుచూ దానితో పాటు పదకొండవ అధ్యాయములో ఈ రెండు అంశాల్ని చర్చించుట పౌలు కొనసాగించును.

దేవునిచే **ఏర్పరచబడినవారు** అనే దృక్పథాన్ని విశ్వాసము ద్వారా అంగీకరించు ప్రజల కొరకు పౌలు చాలా సంతోషకరమైన ముగింపును ఇస్తాడు.

సృష్టియందు దేవుని ఉద్దేశమును గ్రహించడానికి మరియు రోమా తొమ్మిదవ అధ్యాయము నుండి పదకొండవ అధ్యాయము వరకు ఉన్న భాగాన్ని గ్రహించడానికి "ఏర్పరచుట" అనేది కీలకమైయుండగా, మన సంక్షిప్త వర్ణనలో ముందుకు వెళ్లక మునుపే ఈ పదము యొక్క వాడకమును పరిశీలన చేద్దాం.

ఏర్పాటు అనేది **ఎంపిక చేసుకొను కార్యము** లేదా **ఎంచుకొనబడినవారు** అని అర్థమిచ్చును. అది వాడబడిన సందర్భమును బట్టి అర్థము గ్రహించబడుతుంది. దేవుని "ఏర్పాటు" అనేది దేవుడు ఎంపిక చేసుకొనుట అను దానికి పర్యాయపదమైయున్నది.

గ్రీకు పదము "ఎక్లొగె" (ekloge) అనగా "ఎంచి తీసుకోవటం" (pickout) అని అర్థం. (రోమా 9:11; 11:5, 7, 28).

యేసుక్రీస్తు, దేవుడు "ఏర్పరచుకొనినవాడు"(లూకా 23:35). క్రైస్తవ విశ్వాసులు ఏర్పరచబడినవారు (రోమా 8:23, 16:13).

దేవుడు నిత్యరాజ్యంలో పిల్లల్ని కలిగియుండుటకు తన సృష్టిలో ఉన్న ఉద్దేశమును నెరవేర్చు నిమిత్తమై దేవుడు విశ్వాసులను జగత్తు పునాది వేయబడక మునుపే యేసు సారుప్యాన్ని పొందవలెనని ఏర్పాటు చేసుకొన్నాడు (రోమా8:29; ఎఫెసీ. 1:4,5; 2 థెస్స. 2:13). దేవుడు ఏర్పాటు తన కనికరముపై ఆధారపడియున్నది (రోమా 9:14). కాబట్టి, ఆయన ఉద్దేశాన్ని తమకు తాముగా అంగీకరించువారు తప్పకుండా యేసు ద్వారా దేవుని కృపలో విశ్వాసముతో ఏర్పాటును అంగీకరించాలి. క్రైస్తవులు ఏర్పరచబడినవారు (2 పేతురు 1:10).

11:11-15. **యేసుక్రీస్తు విషయమై తొట్రిల్లిన ఇశ్రాయేలీయులు రక్షించబడగలరా?**

ఈ ప్రశ్నకు పౌలు ఇచ్చే ఆశావాదపు సమాధానం సంఘంలో ఉన్న అన్యుల మూలకమువైపుకు నడిపిస్తుంది.

యేసుక్రీస్తును యూదులు తృణీకరించుటను బట్టి, యేసు ద్వారా లోకానికి సమాధానము చేకూరినట్లయితే, లోకంలో ఒక భాగంగా ఇశ్రాయేలీయులు దేవునితో మరల సమాధానపరచబడిన యెడల అది దేవుని ప్రణాళిక యొక్క గొప్ప పరిపూర్ణతగా ఉంటుంది కదా!

ఇశ్రాయేలీయుల కొరకైన పౌలు ప్రార్థనకు జవాబు వస్తుందనే నిరీక్షణతో అతడు ఎదురుచూస్తున్నాడు. అన్యులు గనుక ఒకవేళ విశ్వాసము చేత నడిచి తమ సమాధాన స్థితిలో కొనసాగితే కొంతమంది యూదులు అన్యుల పట్ల అసూయపరులుగా మారి యేసు ద్వారా రక్షణ పొందడానికి ప్రయత్నిస్తారు. నేడు యూదులకు ఒక నిరీక్షణ ఉంది, అయితే అది కేవలం "క్రీస్తునందు" మాత్రమే

11:16-32. **"వేరు పరిశుద్ధమైనదైతే కొమ్మలును పరిశుద్ధములే."**

యూదులు మరియు అన్యులు క్రీస్తు శరీరముగా రూపింపబడిన సంఘంలో ఆరోగ్యకరమైన సహవాసపు నాణ్యతను పెంచి కొనసాగించుటయే పౌలు ఈ పత్రిక వ్రాయడానికి తక్షణ ఉద్దేశమైతే ఈ లేఖన భాగము చాలా శ్రేష్ఠమైన మూలమై యున్నది.

మొదటిగా "ముద్దలో అర్పింపబడు మొదటి పిడికెడు" మరియు "వేరు" అనే వాటిని గుర్తిద్దాం.

వాస్తవమైన ఆత్మీయ నమూనాను నిర్మించడమనేది పౌలు ఈ భాగంలోనే మొదలు పెట్టినందున దీనిని మొదటిసారే సరిగా గ్రహించాల్సిన అవసరత ఉన్నది. అపొస్తలుడైన యోహాను చేత ఆత్మీయంగా ముందు సూచించబడిన సాదృశ్యమును మనం ఉపయోగించిన యెడల మనం సరిగా గ్రహించినవారము (యోహాను 15:1-8).

యేసుక్రీస్తు "ముద్దలో అర్పించబడు మొదటి పిడికెడు" గా యోహాను గుర్తించాడు.

కొమ్మల భారాన్ని భరిస్తూ అవసరమైనవి సరఫరా చేస్తూ ఉన్న "ఒలీవ వేరు" కూడా ఆయనే.

కొమ్మలుగా పౌలు ఎవరిని మన ముందు చూపిస్తున్నాడో వారిని గుర్తించడం కష్టమేమి కాదు.

అడవి ఒలీవ కొమ్మలు ఎవరు? అన్యులు.

ప్రకృతి సంబంధమైన కొమ్మలు ఎవరు? యూదులు.

యూదులు ఎందుకని విరువబడ్డారు?

రోమా 9:31-33; 11:20 చూడుము.

ప్రత్యేకించి కొంతమంది యూదుల్ని విరిచింది ఎవరు?

రోమా 11:1, 8-10 చూడుము.

అన్యుల్ని క్రీస్తులోనికి అంటుకట్టినదెవరు? రోమా 9:25, 26; 11:30 చూడుము. కొందరు అన్యజనుల్ని దేవుడు ఏర్పాటు చేసుకొనిన విషయంలో, ఆయన ముందు చెప్పిన సంగతి ఏమిటి?

ఏర్పరచబడినవారుగా వారు ఎలా కొనసాగుదురు?

రోమా 9:30, 11:20, 22; 2పేతురు 2:10 చూడుము.

"కావున ఇశ్రాయేలీయులందరు రక్షింపబడుదురు" అనేది ఈ మూడు అధ్యాయాలలో చివరి మాట. (రోమా 11:26).

పౌలు ఆత్మీయ ఇశ్రాయేలును "ఏర్పరచబడినవారు" గా "శేషము" గా మరియు "క్రీస్తు సంఘము" గా గుర్తించాడు (రోమా 16:16).